క్లుప్తంగా

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

సామర్లకోట: మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సర్పంచ్ వీరం రెడ్డి శ్రీరామకృష్ణ శ్రీనివాస నాగభూషణరావు, మాజీ సర్పంచ్ సలాది రమేష్ శనివారం స్థానిక విలేకర్లకు తెలిపారు. విజన్ ఐ కేర్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు అందజేస్తారన్నారు.

శృంగార వల్లభుని దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తిరుపతి శృంగార వల్లభస్వామి దర్శనానికి శనివారం భక్తులు బారులు తీరారు. ఇన్‌చార్జి ఈఓ పులి నారాయణమూర్తి, ఆలయ కమిటీ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. అర్చకుడు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు స్వామిని అలంకరించి, అనంతరం భక్తులను ఆశీర్వదించారు. స్వామివారికి వివిధ మార్గాల ద్వారా సుమారు రూ.2.73 సమకూరినట్టు ఈఓ తెలిపారు. ఎంపీటీసీ కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, సిబ్బంది కృష్ణ, సత్యనారాయణ, అంజనికుమార్ హాజరు కాగా సుమారు 15 వేల మంది స్వామిని దర్శించుకున్నట్టు అధికారులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



శ్మశాన వాటికలో ప్రహరీ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని వాకతిప్ప ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న శ్మశాన వాటికలో జిల్లా పరిషత్ నిధులు రూ.7 లక్షలతో నిర్మించిన ప్రహరీ శిలాఫలకాన్ని శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించవలసిన బాధ్యత సచివాలయ కన్వీనర్లు, గృహసారథులకు ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన నాని, సర్పంచ్ పాలాని దొరబాబు తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ బీమా అందజేత



మృతుడి కుటుంబానికి వైఎస్సార్ బీమా సొమ్ము అందిస్తున్న జాన్, సచివాలయ సిబ్బంది

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు నాయక్ కాలనీకి చెందిన ఉమ్మిడి జగన్నాథం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం అతని కుటుంబానికి ప్రభుత్వం అందించిన వైఎస్సార్ బీమా మొదటి విడత సాయం రూ.10 వేలను గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అందజేశారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిపాలనపై అవగాహన అవసరం



జెడ్పీటీసీ సభ్యులకు సర్టిఫికెట్లు అందజేసిన డీఎల్‌డీఓ, ఈటీసీ ప్రిన్సిపాల్ వేణుగోపాల్

సామర్లకోట: జెడ్పీటీసీ సభ్యులు శిక్షణను సద్వినియోగం చేసుకుని పరిపాలనపై అవగాహన పెంచుకోవాలని డీఎల్‌డీఓ పి.నారాయణమూర్తి అన్నారు. స్థానిక ఈటీసీలో ఐదో బ్యాచ్ సభ్యులకు శనివారంతో శిక్షణ ముగిసింది. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పరిపాలన విధానంపై అవగాహన ఉన్నప్పుడే అధికారులను ప్రశ్నించే ధైర్యం ఉంటుందన్నారు. ఈటీసీ ప్రిన్సిపాల్ జె.వేణుగోపాల్, వైస్ ప్రిన్సిపాల్ ఈ కృష్ణమోహన్, ఈటీసీ ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, బి.ఆంజనేయులు ప్రసాద్, ఎంఎస్ఎన్ రెడ్డి శిక్షణ ఇచ్చారు. అనంతరం సభ్యులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఆర్‌బీకేలు.. రైతు నేస్తాలు

- సొంత గ్రామాల్లోనే ఎరువులు, విత్తనాలు అందజేత
- మండలంలో 23 రైతు భరోసా కేంద్రాలు
- 5630 మంది రైతులకు సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



గోర్సలో రైతు భరోసా కేంద్రం



ఇసకపల్లిలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు

కొత్తపల్లి: ఒకప్పుడు రైతులన్నా, వారి కష్టాలన్నా ఎవరికీ పట్టేదికాదు. గత టీడీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగ అంటూ రైతులను కించపరిచాడు. ప్రస్తుతం రైతులకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు. వారి సంక్షేమం కోసం రైతు భరోసా కేంద్రాలు (ఆర్బీకేల)ను గ్రామాల్లోనే ఏర్పాటు చేశారు. ఇవి ప్రస్తుతం దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. ఆర్‌బీకేల ద్వారా సొంత గ్రామంలోనే రైతులకు కావాల్సిన అన్ని సేవలు అందుతున్నాయి. గడిచిన నాలుగేళ్లలో ఆర్‌బీకేలు రైతులకు నేస్తాలుగా మారాయి. మండలంలో 23 రైతు భరోసా కేంద్రాల ద్వారా 5630 మంది రైతులకు సేవలు అందిస్తున్నారు.

అన్ని రకాల సేవలు

గతంలో రైతులకు ఏ అవసరం వచ్చినా మండల కేంద్రంలో ఉండే వ్యవసాయ శాఖ కార్యాలయానికి వెళ్లవలసి వచ్చేది. ప్రస్తుతం ప్రతి గ్రామంలోనూ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం వలన రైతులు తమ సొంత గ్రామంలోనే అన్ని సేవలూ పొందుతున్నారు. ముఖ్యంగా భూసార పరీక్షలు నిర్వహించడం ఎంతో ఉపయోగకరంగా ఉంది.

కియోస్కో యంత్రాలతో ఎన్నో ప్రయోజనాలు

ఆర్బీకేల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కియోస్కో యంత్రాల ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతోంది. తమకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు 48 గంటల్లోనే నేరుగా రైతులకు సబ్సిడీపై అందుతున్నాయి.

ఎరువులు, విత్తనాల పంపిణీ

ఆర్బీకేల ద్వారా రైతులకు సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనియుట్లతో పాటు గ్రూపుగా ఏర్పడిన రైతులకు ట్రాక్టర్లను సబ్సిడీపై అందిస్తున్నారు.

ఈ–క్రాప్ నమోదు

ప్రతి రైతు తాము సాగు చేసిన పంటలకు ఈ–క్రాప్ నమోదు చేయించుకుంటున్నారు. తద్వారా విపత్తులు, తుపానుల కారణంగా పంట నష్టపోతే ప్రభుత్వం నుంచి నష్టపరిహారం పొందే అవకాశం కలిగింది. ఈ–క్రాప్ సర్టిఫికెట్ ద్వారా రైతులకు బ్యాంకులు పంట రుణాలను అందజేస్తున్నాయి.

కొత్తపల్లి మండలంలో ఆర్‌బీకేల వివరాలు

మొత్తం రైతు భరోసా కేంద్రాలు	23
మొత్తం రైతులు	5,630
పంటసాగు	12 వేల ఎకరాలు
రైతు భరోసా సాయం అందుకుంటున్న రైతులు	5,195
ఇప్పటి వరకూ అందించిన కౌలు కార్డులు	683
గత నాలుగేళ్లలో రైతులకు అందించిన వరికోత యంత్రాలు	7
ట్రాక్టర్లు	12
సంవత్సరానికి రైతులకు అందిస్తున్న ఎరువులు	1200 టన్నులు

తక్కువ ధరకే ఎరువులు, విత్తనాలు



రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం అన్ని రకాల ఎరువులు, విత్తనాలను రైతులకు సబ్సిడీపై అందిస్తోంది. సీజన్‌తో సంబంధం లేకుండా రైతులకు అవసరమైన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు ఆర్‌బీకేల్లో దొరుకుతున్నాయి. మార్కెట్ ధర కంటే రైతు భరోసా కేంద్రాలో ఎరువులు, విత్తనాలు తక్కువకే లభిస్తున్నాయి. ఆర్‌బీకేలను గ్రామాల్లోనే ఏర్పాటు చేసి రైతులకు సేవలు అందించాలనే ముఖ్యమంత్రి ఆలోచన అమోఘం.

ఎరకం సూర్యనారాయణరెడ్డి, రైతు, ఇసుకపల్లి

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



రైతు భరోసా కేంద్రాల్లో సిబ్బంది ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లో చేపట్టే ఈ–క్రాప్ బుకింగ్‌తో ప్రయోజనం కలుగుతుంది. ప్రకృతి వైపరీత్యాలతో పంటకు నష్టం వాటిల్లితే పంటల బీమా కింద నష్ట పరిహారం ఇస్తున్నారు. రైతుల కోసం పరితపిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటాం.

కె.అప్పారావు, రైతు, ఇసుకపల్లి

రైతులకు మెరుగైన సేవలు



రైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందించే సేవలపై ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. గ్రామాల్లో ఉన్న రైతుభరోసా కేంద్రాల ద్వారా అన్నదాతలకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ముఖ్యంగా రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజనూ రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తున్నాం.

వి.జోగిరాజు, మండల వ్యవసాయాధికారి, కొత్తపల్లి

విశ్వసనీయతకు మారుపేరు జగన్

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- వాకతిప్పలో సీసీ రోడ్లకు శంకుస్థాపన



వాకతిప్పలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: విశ్వసనీయతకు మారుపేరు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని వాకతిప్పలో రూ.20 లక్షలతో నిర్మించే సీసీరోడ్లకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో నరకాసుర పాలన సాగేదన్నారు. ప్రస్తుతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేయడమే కాకుండా ప్రతి గ్రామంలోనూ గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. ప్రతి సచివాలయం పరిధిలోని అభివృద్ధి పనుల కోసం రూ.20 లక్షలు కేటాయిస్తున్నట్టు చెప్పారు. మాజీ ఎమ్మెల్యే వర్మ గ్రామాల్లో తిరుగుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిపై మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా ప్రతిఒక్కరూ పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ కారే సుధ, జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిని సురేష్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి రావు చిన్నారావు, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ జ్యోతుల బాబులు, ఎస్సీ, ఎస్టీ డివిజన్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు బండి దావీదు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యదేవుని ప్రాకారసేవ

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ప్రాకారసేవ శనివారం ఘనంగా నిర్వహించారు. పండితులు ఉదయం 10 గంటలకు సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనం మీద ప్రతిష్ఠించి తూర్పు రాజగోపురం వద్ద గల ఆలయప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసి వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయప్రాకారంలో మూడుసార్లు ఊరేగించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు ప్రధానాలయానికి చేర్చారు.

సత్యదేవుని దర్శించిన కమలానంద స్వామీజీ

గన్నవరానికి చెందిన హిందూ దేవాలయ పరిరక్షణసమితి వ్యవస్థాపకుడు, భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి శనివారం సాయంత్రం రత్నగిరిపై సత్యదేవుని దర్శించి పూజలు చేశారు. స్వామీజీకి ఆలయం వద్ద పండితులు ఘన స్వాగతం పలికారు. దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేయగా స్వామివారి ప్రసాదాలను ఈఓ చంద్రశేఖర్ అజాద్ బహూకరించారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

మృతదేహంతో బంధువులు ఆందోళన



జల్లూరు మెయిన్ రోడ్డుపై ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

పిఠాపురం: అమ్మవారి జాతరలో చెట్టుకు ఊయల కడుతూ ప్రమాదవశాత్తూ కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ మృతదేహంతో బంధువులు ఆందోళనకు దిగారు. ఈ ఘటనకు సంబంధించి పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పిఠాపురం మండలం జల్లూరుకు చెందిన కొల్లు సుబ్బారావు (55) స్థానికంగా ప్రైవేటు పారిశుద్ధ్య కార్మికుడిగా పని చేస్తున్నాడు. గ్రామ దేవత ముత్యాలమ్మ జాతర సందర్భంగా శనివారం గ్రామంలో అమ్మవారి ఆలయం వద్ద రావి చెట్టుకు ఊయల కడుతుండగా ప్రమాదావశాత్తూ జారి కింద పడి పోయాడు. తీవ్ర గాయాలైన అతడిని ఆస్పత్రికి తరలించే లోపు మృతి చెందాడు. ఉదయం సుబ్బారావు మృతి చెందినప్పటికీ జాతర నిర్వాహకులు పట్టించుకోలేదని ఆరోపిస్తూ మృతదేహంతో మహాజన సోషలిస్టు పార్టీ జిల్లా కన్వీనర్ వల్లూరు సత్తిబాబు ఆధ్వర్యంలో మృతుడి బంధువులు జల్లూరు మెయిన్ రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో చర్చలు జరిపారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం

ఎమ్మెల్యే పెండె దొరబాబు



గోర్సలో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే దొరబాబు

కొత్తపల్లి: అగ్ని ప్రమాద బాధిత కుటుంబాలను ప్రభుత్వం తరఫున అన్నివిధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. మండలంలోని గోర్స ఎస్సీపేటకు చెందిన బూరా లోవరాజు, బూరా పామియ్య, బూరా నూకరాజుకు చెందిన తాటాకిళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయాయి. కాగా బాధిత కుటుంబాలను శనివారం ఎమ్మెల్యే పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధిత కుటుంబాలు ఐఏవై ద్వారా ఇల్లు నిర్మించుకునేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఇటువంటి పరిస్థితి ఏ కుంటుంబానికి రాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు పక్కా ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, సర్పంచ్ రొంగల వీరబాబు, వైస్ ఎంపీపీ చెట్టుబత్తిన సురేష్‌కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు ఆనాల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

చెట్ల అవశేషాలను తొలగించండి



ప్రధాన డ్రైనులో కూలిన చెట్లు

సామర్లకోట: గత నెల 28న వీచిన ఈదురుగాలులకు స్థానిక గాంధీచౌక్ నుంచి రైల్వే గేటు మీదుగా ఉన్న ప్రధాన డ్రైనులో కూలిన చెట్లను నేటికీ తరలించలేదు. దీంతో డ్రైనులో నీటికి అవి అడ్డుపడి ప్రవాహానికి ఇబ్బందిగా మారాయి. పట్టణ పరిధిలోని మురుగు, వర్షపు నీరు ఈ డ్రైను నుంచి ఏలేరు కాలువలో కలుస్తుంది. దీనిపై మున్సిపల్ కమిషనర్ జె.రామారావును ప్రశ్నించగా డ్రైనును పరిశీలించి చెట్ల తొలగింపుతో పాటు ప్రధాన డ్రైనులో పూడిక తీయిస్తామని తెలిపారు.

హిందూ ధర్మం బలీయమైనది

కాకినాడ కల్చరల్: హిందూ ధర్మం చాలా బలీయమైనది. ఇంతటి నియమబద్ధ వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా లేదని పద్మశ్రీ డాక్టర్ గరికిపాటి నరసింహారావు అన్నారు. స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో నల దమయంతి చరిత్రపై ఆయన ప్రవచనాలు చేస్తున్నారు. వారి చరిత్రను ఆధునిక కాలానికి ఎలా అన్వయించవచ్చో శనివారం నాటి ప్రవచనంలో వివరించారు. సంతృప్తి, వాత్సల్యం, దంపతులు ప్రేమతో జీవించాలని అన్నారు. భర్త శోకంలో ఉన్నప్పుడు భార్య తోడుండి ఉపశమనం కలిగించాలని అన్నారు. ధార్మర్థకామమోక్షాలు మన వ్యవస్థకు పునాదులని అన్నారు. భార్యభర్తల అనుబంధం చాలా పవిత్రమైనదని, నలుడు పుష్కరుడితో పాచికలు ఆడి తన సంపదను, రాజ్యాన్ని కోల్పోయిన ఘట్టాలను, సర్వం కోల్పోయిన దమయంతి తన పిల్లలను రథసారధితో తన తండ్రి రాజ్యానికి పంపే సమయంలో ఆమె పడిన వేదనను, దయయంతి నిద్రపోతున్నప్పుడు కలి ప్రభావంతో నలుడు ఆమెను విడచి వెళ్లిన ఘట్టాలను, ఇన్ని కష్టాలను ఎదుర్కొని మరీ తన జీవితాన్ని సరిదిద్దుకున్న దమయంతిని మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని వివరించారు. పెళ్లైన సంవత్సరంలో భార్యభర్తల మధ్య అన్యోన్యత బలపడుతుందన్నారు. 'ఇగో' తో ప్రవర్తించిన వారితో 'యూ గో' అనడమే సరియైన సమాధానమని ఆయన చమత్కరించారు. నల దమయంతుల వలె భర్తకు భార్యతగిన సలహాలు ఇవ్వాలి తప్ప అన్నింటికి తందాన తాన అనకూడదని చలోక్తులతో వివరించారు. గాన సభ అధ్యక్షుడు కెవీఎస్ ఆంజనేయమూర్తి, కార్యదర్శి పేపకాయల రామకృష్ణ, ఉపాధ్యక్షుడు ఎల్.సత్యనారాయణ్, మునుగంటి వెంకట్రావు, శ్రీరామచందరమూర్తి, పెద్దాడ సూర్యకుమారి, చావలి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

జీజీఎంపీ పనులను వేగంగా పూర్తి చేయండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం (జీజీఎంపీ)లో భాగంగా మంజూరు చేసిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ కృతికా శుక్లా అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టర్ కార్యాలయంలో ప్లానింగ్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీ ఈపీ డీసీఎల్, సోషల్ వెల్ఫేర్, వివిధ మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లతో సమీక్షించి పనుల ప్రగతిని తెలుసుకున్నారు. జిల్లాలో ప్రతి గ్రామ, వార్డు సచివాలయం పరిధిలో డ్రైనేజీలు, సీసీ రోడ్లు, సామాజిక భవన నిర్మాణాల నిమిత్తం రూ.20 లక్షలు మంజూరయ్యాయని. ఇంకా ప్రారంభం కాని పనులను రానున్న వారం రోజుల్లో గ్రౌండింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సీపీవో పి.త్రినాథ్, సోషల్ వెల్ఫేర్ డీడీ డీవీ రమణమూర్తి, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఈ పి.సత్యకుమారి పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారీ స్కూళ్లు

- ఎమ్మెల్యే పెండెం దొరబాబు
- పిఠాపురంలో జగనన్న ఆణిముత్యాలకు సత్కారం



పిఠాపురంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పెండెం దొరబాబు

పిఠాపురం: విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దిన ఘనత సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే పెండెం దొరబాబు అన్నారు. పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు–నేడు పథకంలో పేద విద్యార్థులు కార్పొరేట్ విద్యను అందుకునేలా ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలు మార్చేశారన్నారు. పేదలకు ఉన్నత విద్య అందించాలన్న సంకల్పంతో అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులపై భారం పడకుండా విద్యకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. విద్యా రంగం అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి సత్తా చాటారన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, నగదు బహుమతులు అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను సత్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ బుర్రా అనుబాబు, గండేపల్లి బాబీ, కొత్తపల్లి జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్, ప్రవీణ్ పాల్గొన్నారు.

ఆణిముత్యాలతో పోటీతత్వం

సామర్లకోట: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకాలు, సర్టిఫికెట్లు, పతకాల ద్వారా వారిలో పోటీతత్వం పెరిగి మరింత ప్రగతి సాధిస్తారని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు అన్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన సూరిశెట్టి గణేష్‌కు రూ.మూడు వేలు, హరికిరణ్‌కు రూ.రెండు వేలు, ఏఎస్‌కే గాంధీకి రూ.వెయ్యి నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులను అభినందించారు. హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించగా విద్యాకమిటీ చైర్మన్ చందలాడ వెంకట్రావు, ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యు లు పాల్గొన్నారు. అలాగే యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ ముఖ్య అతిథిగా హాజరై ఎల్.శివరంజనికి రూ.మూడు వేలతో పాటు, మరో వెయ్యి నగదు బహుమతి అందజేసి సత్కరించారు. అలాగే ఎం.ప్రదీప్ రోషన్‌కు రూ.రెండు వేలు, బి.డేవిడ్ రంగారావుకు రూ.వెయ్యి బహూకరించారు. ఉపాధ్యాయుడు కెనడీ అధ్యక్షతన హెచ్ఎం యు. సత్యనారాయణ, పీడీ వెంకటేశ్వరరావు విద్యార్థులను సత్కరించారు.

అలాగే వేట్లపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు ముఖ్య అతిథిగా హాజరై పి.కాంతిదీపికకు రూ.మూడు వేలు, కె.ఆదిలక్ష్మికి రూ.రెండు వేలు, సీహెచ్‌బీఎస్ఎస్ రాకేష్‌కు రూ.వెయ్యితో పాటు పతకాలు, సర్టిఫికేట్లు అందజేశారు. హెచ్ఎం అనురాధ అధ్యక్షత వహించగా గ్రామ సర్పంచ్ చిల్లి వెంకటలక్ష్మి, విద్యాకమిటీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో ఆణిముత్యాలతో కమిషనర్ తదితరులు

విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించాలి

పెద్దాపురం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యార్థులతో సమానంగా చదివి ఉత్తమ మార్కులు సాధించాలని జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు, కట్టమూరు ఎంపీటీసీ నల్లల సూర్యకుమారిలు అన్నారు. శనివారం మండలంలోని కట్టమూరు, కాండ్రకోట గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన సత్కరించారు. హెచ్ఎంలు సత్యవాణి, మూర్తి, ఏఎస్‌వి శాస్త్రి, సర్పంచ్‌లు దిమ్మల పుష్పరత్నం, మాకిరెడ్డి శ్రీనివాస్, ఎంపీటీసీ వీరభద్రరరావు, గవరసాని వీరాస్వామి, లక్కాకుల కృష్ణ, గంటా రామస్వామి, గవరసాని రాజశేఖర్, మాదిరెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులతో ఆవాల, హెచ్ఎం తదితరులు



వేట్లపాలెం జెడ్పీ హైస్కూల్‌లోని విద్యార్థులతో ఎంపీపీ తదితరులు



కట్టమూరులో జగనన్న ఆణిముత్యాలను సత్కరిస్తున్న నాయకులు



కాండ్రకోటలో ఆణిముత్యాలతో జెడ్పీటీసీ తదితరులు